క్లుప్తంగా

ఎన్నికల నిర్వహణకు పోలీసు కవాతు



భట్టిప్రోలు: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని కేంద్ర సాయుధ బలగాలతో కలసి శుక్రవారం పోలీసులు కవాతు నిర్వహించారు. భట్టిప్రోలు, పల్లెకోన పురవీధులలో కవాతు నిర్వహించి ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశానుసారం ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. పోలీసులు భద్రత కల్పిస్తారనే ఆలోచన ప్రజల్లో కల్పించే ఉద్దేశ్యంతో కవాతు నిర్వహించినట్లు తెలిపారు.

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు



భట్టిప్రోలు: ముస్లింలు అతి పవిత్రంగా భావించే రంజాన్ నెల ఉపవాసాలతో ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం భట్టిప్రోలు, అద్దేపల్లి, వెల్లటూరు, పల్లెకోన, వేమవరం గ్రామాలలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు నమాజులు, ఉపవాసాలు, పుణ్యకార్యాలు నిర్వహించడం అనవాయితీగా వస్తుంది.

కొట్లాటలకు పాల్పడితే కఠిన చర్యలు



ప్రత్తిపాడు: గొడవల్లో తల దూర్చడం, కొట్లాటలకు పాల్పడటం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రత్తిపాడు ఎస్ఐ రౌడీ షీటర్లకు హెచ్చరికలు జారీ చేశారు. స్థానిక పోలీస్ స్టేషనులో శుక్రవారం రౌడీ షీటర్లుకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్నికల సమయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. వివాదాల్లోకి వెళ్లడం, అల్లర్లు, గొడవలకు పాల్పడటం వంటివి చేస్తే ఎలాంటి పరిస్థితుల్లోనూ ఉపేక్షించమన్నారు. ప్రతి రోజూ కదలికలపై పూర్తి స్థాయి నిఘా ఉంచుతామన్నారు. ఏ చిన్న అనుమానం తలెత్తినా అదుపులోనికి తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

పెదకాకాని: పేకాట ఆడుతున్న 8 మందిపై కేసు నమోదైంది. మండల పరిధిలోని తంగెళ్లమూడి గ్రామ శివార్లలోని సపోటా తోటలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ముందస్తు సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. 8 మంది పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.60,570 నగదు, 8 బైక్‌లు స్వాధీనం చేసున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ కె వీరాస్వామి తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఆటో



తెనాలిరూరల్: తెనాలి మండలం ఆటోనగర్ వద్ద శుక్రవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సును ఆటో ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో నలుగురు తీవ్రంగా గాయపడగా.. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిలో చిన్నారులు, మహిళలు ఉన్నారు. ప్రమాదానికి సంబంధించి బాధితుల వివరాల మేరకు.. కొల్లిపర మండలం మున్నంగి గ్రామానికి చెందిన కొందరు కఠెవరంలో బంధువులు చనిపోవడంతో శుక్రవారం ఆటోలో వచ్చారు. సాయంత్రం స్వగ్రామానికి బయలుదేరారు. ఆటోలో డ్రైవర్‌తో పాటు మరో పది మంది వరకు ప్రయాణిస్తున్నారు. ఆటో నగర్ వద్దకు రాగానే వీరి ఆటో ఆర్టీసీ బస్సును వేగంగా ఢీ కొట్టింది. దీంతో ఆటోలో ఉన్నవారు గాయపడ్డారు. వారిని రెండు 108 అంబులెన్సులలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆటో డ్రైవర్ వేమూరి నాగరాజు పరిస్థితి విషమంగా ఉండటంతో అతడిని అత్యవసర చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వేమూరి మల్లేశ్వరి, గురిందపల్లి అభినయ, నవతేజ్‌కు తీవ్రగాయాలు అయ్యాయని పోలీసులు తెలిపారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సబ్‌స్టేషన్‌ల ఏర్పాటుతో విద్యుత్ సమస్యలకు పరిష్కారం

ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుతో విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. శుక్రవారం బాపట్ల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన గల ఖాళీ స్థలంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.8.5 కోట్ల వ్యయంతో నూతన సబ్ స్టేషన్ నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ స్టేషన్ నుంచి ఏరియా వైద్యశాలకు ప్రత్యేక లైన్ నిర్మాణం, కలెక్టర్ ఆఫీస్‌కు ప్రత్యేక 11 కేవీ లైన్ నిర్మాణం ఏర్పడుతుందని చెప్పారు. తద్వారా విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గువ్వల ఆంజనేయులు, హరిప్రసాద రావు, పెరుగు శ్రీనివాసరావు, పాల్గొన్నారు.



విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న రఘుపతి

సీఏఏ చట్టాన్ని రద్దు చేయాలి

రేపల్లె రూరల్: ముస్లిం మైనార్టీల ఉనికికి ప్రమాదం వాటిల్లే సీఏఏ పౌరసత్వ సవరణ చట్టం నిబంధనలను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి చిక్కాల మణిలాల్ అన్నారు. సీఏఏ చట్టానికి వ్యతిరేకంగా పట్టణంలోని ఓల్డ్‌టౌన్ పెద్ద మసీదు వద్ద లౌకిక పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2019లో తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టాన్ని ప్రజలంతా ఐక్యంగా తిప్పి కొట్టడంతో నాడు వెనక్కి తగ్గిన కేంద్రం నేడు ఎన్నికల ముందు మళ్లీ తెరమీదకు తీసుకురావటం కేంద్రం కుట్రలో భాగమేనన్నారు. సీఏఏ నోటిఫికేషన్‌ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని కోరుతూ లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదికగా దేశంలో ప్రజాస్వామ్య వాదులందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు కే.ఆశీర్వాదం, లక్ష్మణరావు, ఆగస్టిన్, వై.నవీన్, ఓల్డ్ టౌన్ మసీద్ ముస్లిం పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్

నేడు విగ్రహాల ఏర్పాటు

రేపల్లె రూరల్: పట్టణంలోని ఓల్డ్‌టౌన్ అంకమ్మ చెట్టు సెంటరులో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు, మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యల విగ్రహాల ఏర్పాటు కార్యక్రమాన్ని శనివారం ఉదయం 8 గంటలకు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్, బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావులు పాల్గొంటారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని సూచించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

తెనాలిరూరల్: తెనాలి పాత ప్రభుత్వ వైద్యశాల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం మృతిచెంది పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం దించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు సుమారు 30 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతి చెందినట్టు గుర్తించారు. అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు యాచకుడై ఉంటాడని స్థానికులు చెబుతున్నారు.

భార్యకు ఉద్యోగం రాలేదని భర్త ఆత్మహత్యాయత్నం

భట్టిప్రోలు: తన భార్యకు అంగన్‌వాడీ ఆయా పోస్టు కోసం దరఖాస్తు చేయగా ఉద్యోగం రాకపోవటంతో మనస్థాపానికి గురై భర్త ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని కోళ్లపాలెంలో చోటు చేసుకుంది. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టు నాలుగు నెలల క్రితం ఖాళీ అయ్యింది. పోస్టుల భర్తీకై అమృతలూరు సీడీపీవో కార్యాలయం నుంచి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ పోస్టు కోసం గ్రామానికి చెందిన జల్లి కవిత దరఖాస్తు చేసుకుంది. ఇంటర్వ్యూ కూడా జరిగింది. ఆ తరువాత పోస్టును గురించి సీడీపీవో విజయలక్ష్మిని సంప్రదించగా ప్రాజెక్ట్ డైరెక్టర్ పోస్టు భర్తీని నిలుపుదల చెయ్యమన్నారని బదులిచ్చారు. పీడీని ఫోన్‌లో సంప్రదిస్తే ముడుపు చెల్లిస్తేనే పోస్టు ఇస్తానని చెప్పడంతో మనస్తాపానికి గురైన కవిత భర్త సాల్మన్ శుక్రవారం స్వగ్రామమైన కోళ్లపాలెంలో ఇంటి పక్కనే ఉన్న చెట్టుకు ఉరివేసుకునే ప్రయత్నం చేశాడు. అటుగా వెళుతున్న స్థానికులు చూసి రక్షించారు. ఈ విషయమై ఇన్‌చార్జి ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ఉమను ఫోన్‌లో వివరణ కోరగా కోళ్లపాలెం, భట్టిప్రోలుకు సంబంధించి ఒక్కో దరఖాస్తు మాత్రమే అందిందని తెలిపారు. నోటిఫికేషన్ సరిగా ఇష్యూ చేయలేదని పబ్లిక్ నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ పోస్టులు భర్తీ చేయకుండా సెలక్షన్ కమిటీ ఆదేశానుసారం నిలుపుదల చేయడం జరిగిందన్నారు. ఈ విషయం జేసీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తాను వారి నుంచి ఎటువంటి ముడుపులు అడగలేదని ఇదంతా అవాస్తవమని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్సార్ సీపీని రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించే విధంగా నాయకులు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మురళీకృష్ణ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాలో పలు విభాగాల్లో పార్టీ పదవుల్లో నియమితులైన పొన్నూరు నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులకు అభినందన సభ నిర్వహించారు. పట్టణానికి చెందిన గుంటూరు జిల్లా మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మూకిరి అనిలా కుమారి, జిల్లా సేవాదళ్ కార్యదర్శులు ఆరేటి మధుసూదన్ రావు, వేముల మూర్తి రాజు, జిల్లా ట్రేడ్ యూనియన్ సంయుక్త కార్యదర్శి పలగాని రమేష్, జిల్లా వాణిజ్య విభాగ సంయుక్త కార్యదర్శి సయ్యద్ గౌస్, జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవరకొండ గోపి, నిడుబ్రోలుకు చెందిన జిల్లా వికలాంగుల విభాగ కార్యదర్శులు కాట్రగడ్డ విజయకుమార్, కొల్లూరు నవీన్, చేబ్రోలుకు చెందిన జిల్లా పంచాయతీ రాజ్ కార్యదర్శి పరిమి సత్యలను సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఘనంగా సత్కరించి అభినందించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పదవులు పొందిన ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ గెలుపే ధ్యేయంగా బాధ్యతతో పనిచేయాలని కోరారు.

వైఎస్సార్ టీయూసీ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు గానూ పట్టణానికి చెందిన పండ్ల వ్యాపారి అంబటి చంద్రశేఖరరావు శుక్రవారం పార్టీ కార్యాలయంలో పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పండ్ల వ్యాపారులు మురళీకృష్ణను సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు అంబటి వెంకటేశ్వరరావు, విజయ్, రత్నం, రమణ, శేఖర్, లాడెన్, శివన్నారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సత్కార గ్రహీతలతో సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్యానికి భరోసా

పొన్నూరు: ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేసి ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తుందని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని నండూరు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి వైద్య సిబ్బంది చేపడుతున్న ఆరోగ్య పరీక్షలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సభలో మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలలో ఏడు రకాల వైద్య పరీక్షలు చేసి నిర్ధారణ అయిన వ్యాధి నయమయ్యేంత వరకు సరిపడా మందులు అందిస్తున్నట్లు తెలిపారు. వ్యాధి తీవ్రత ఆధారంగా మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యశాలల్లో పూర్తి స్థాయిలో వైద్యాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు వరం లాంటిదని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ అక్కి నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ నాజర్, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం అందజేత

పొన్నూరు: మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక పూరిల్లు, రెండు గడ్డివాములు దగ్ధం కాగా ఒక గేదె మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న అగ్ని మాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసినా ఫలితం దక్కలేదు. పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి నష్ట పరిహారాన్ని అందించే విధంగా చేస్తానని బాధితులకు భరోసా ఇచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాడలేని ఓటరు జాబితాలు

- పోలింగ్ బూత్‌ల వద్ద కానరాని వైనం
- ఎన్నికల అధికారుల తీరుతో ఓటర్లకు ఇక్కట్లు

ప్రత్తిపాడు: జనవరి 22న ఓటరు ముసాయిదా జాబితాను అధికారులు ప్రచురించారు. అందులో పెద్ద ఎత్తున తప్పులు దొర్లాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ మార్పులు చేర్పులకు అవకాశం కల్పించింది. నామినేషన్లకు పది రోజుల ముందు వరకు క్లెయిమ్‌లు దాఖలు చేసుకునేందుకు సమయం ఉంది. బీఎల్‌వోలు జాబితాలను పోలింగ్‌కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచక పోవడం, వారు ఎక్కడ విధుల్లో ఉంటారో తెలియకపోవడంతో ఓటర్లు జాబితాల కోసం కార్యాలయాలు, పోలింగ్ బూత్‌ల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుంది. మండలంలో 40కు పైగా పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. 95 శాతం పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్ల జాబితాలు అందుబాటులో లేని పరిస్థితి చోటు చేసుకుంది. పట్టించుకోవాల్సిన ఎన్నికల అధికారులు, మండల స్థాయి అధికారులు తమకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తుండటంతో ఓటర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని ఓటర్ల జాబితాలు అందుబాటులో ఉంచాలని ఓటర్లు కోరుతున్నారు.

జాబితాలు హెచ్‌ఎంలకు ఇచ్చాం

ఓటర్ల జాబితాలను పోలింగ్ బూత్‌ల వద్ద ఉంచితే ఎవరైనా తీసుకువెళతారేమోనని ప్రత్తిపాడులో ఉన్న రెండు పాఠశాలల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు జాబితాలను ఇచ్చాం. వారి వద్దకు వెళ్లి ఓటర్ల జాబితాలు తీసుకుని పరిశీలించుకోవచ్చని ప్రత్తిపాడు మండల ఎన్నికల డీటీ సుభాష్ 'సాక్షి'కి తెలిపారు. అయితే 'సాక్షి' ఆయా పాఠశాలల హెచ్‌ఎంలను వివరణ కోరగా ప్రత్తిపాడు హైస్కూల్ హెచ్‌ఎం మాకు ఎలాంటి జాబితాలు ఇవ్వలేదని చెప్పారు. ప్రత్తిపాడు హెచ్‌ఈ మెయిన్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మాత్రం ఒక్కరోజు ఇచ్చి, ఆ రోజే వెంటనే తీసుకొని వెళ్లిపోయారని, మా వద్ద ఉంచలేదని చెప్పడం గమనార్హం.

మహిళ మెడలో గొలుసు చోరీ

నగరంపాలెం: నడిచి వెళ్తున్న మహిళ మెడలో బంగారు గొలుసు తెంచుకెళ్లిన ఘటనపై పట్టాభిపురం పీఎస్‌లో కేసు నమోదైంది. విద్యానగర్ ఒకటో వీధిలో శుక్రవారం సాయంత్రం అత్తోట అరుంధతి నడిచి వెళుతున్నారు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకుల ఓ పాఠశాల సమీపాన ఆమె మెడలోని బంగారు గొలుసు తెంచుకెళ్లారు. బాధితురాలు ఫిర్యాదుతపోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

తెనాలిరూరల్: మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. తెనాలి జేఎంజే కళాశాల సమీపంలో నివసించే మహిళతో అంగలకుదురుకు చెందిన టైలర్ అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె చేయి పట్టుకుని లాగడమే కాకుండా అసభ్య పదజాలంతో దూషించాడు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయగా శుక్రవారం కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు తెలిపారు.

ప్రజారోగ్యంపై శ్రద్ధ పెట్టండి

చిన కాకుమాను(కాకుమాను): ఆరోగ్య సిబ్బంది ప్రతి రోజు ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కాకుమాను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రాజశేఖర్ అన్నారు.ఫ్రైడే డ్రైడే సందర్భంగా మండలంలోని చిన కాకుమాను గ్రామంలో శుక్రవారం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సచివాలయ వ్యవస్థతో ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు

నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్

నగరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ చెప్పారు. మండలంలోని పూడివాడ గ్రామంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలను ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందిందన్నారు. మహిళ సాధికారతే లక్ష్యంగా అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత, వంటి పలు పథకాల కింద మహిళల బ్యాంక్ ఖాతాలకు నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీల పొత్తును ప్రజలు విశ్వసించరన్నారు. ఎంత మంది కలిసినా రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కేశవతి, సృజన్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు పాగోలు వెంకటేశ్వరావు, పోలిరెడ్డి, భాస్కరరెడ్డి, పద్యాల బుల్లియ్య, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



పూడివాడలో ప్రజలతో మమేకమైన డాక్టర్ గణేష్

రైతు భరోసా కేంద్రాలతో అన్నదాతలకు మేలు

పెదగాదెలవర్రు(వేమూరు): రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతి రైతుకు సేవలు పారదర్శకంగా అందుతున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు అన్నారు. చుండూరు మండలంలోని పెదగాదెలవర్రు గ్రామంలో శుక్రవారం రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం, వైఎస్సార్ ఆరోగ్య క్లినిక్ కేంద్రాలు ప్రారంభించారు. గ్రామ సచివాలయానికి రూ.46.60 లక్షలు, వెల్‌నెస్ కేంద్రానికి రూ.17.5 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.21 లక్షలు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లకుండా గ్రామీణ ప్రాంతాల్లోని వారి ఇళ్ల వద్దకే ప్రభుత్వం సేవలు అందించడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జాలాది రూబేను, వరికూటి లక్ష్మి, గ్రామ సర్పంచ్‌లు కొల్లి రమాదేవి, వుయ్యూరి సుబ్బారెడ్డి, వుయ్యూరి అప్పిరెడ్డి, తాడిశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కొండ శివ ప్రసాద్ రెడ్డి, మండూరు నాగేశ్వరరావు, మూల్పూరు స్వామి తదితరులు పాల్గొన్నారు.



రైతు భరోసా కేంద్రం వద్ద స్థానిక నాయకులతో వరికూటి

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

భట్టిప్రోలు: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని సర్పంచ్ దారా రవికిరణ్మయి తెలిపారు. భట్టిప్రోలు-2 సచివాలయం పరిధిలోని అద్దేపల్లి ఎంపీయుపీ స్కూల్ ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌లో పీహెచ్‌సీల వైద్యులు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ స్పెషలిస్ట్ డాక్టర్లు, కంటి వైద్య నిపుణులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, ఉప సర్పంచ్ బూర్లె రామప్రసాద్, ఎంపీడీవో జేబీవీ మల్లిఖార్జునరావు, పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జేవీ రమణమ్మ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు కుందేటి రమేష్, దారా చెన్నయ్య, దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజీ, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు. శిబిరాన్ని అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి విజయలక్ష్మి సందర్శించారు.

రథోత్సవానికి పటిష్ట చర్యలు చేపట్టాలి

ఆర్అండ్‌బీ డీఈ టి.గురుపాచారి

భట్టిప్రోలు: ఈ నెల 24న జరిగే భట్టిప్రోలు తిరునాళ్ల నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ డీఈ టి. గురుపాచారి సూచించారు. ఈ నెల 20 నుంచి శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో కల్యాణ మల్లేశ్వరుడు ఊరేగనున్న రథాన్ని శుక్రవారం పరిశీలించి దేవాదాయ శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. రథం చక్రాలకు తారు, గ్రీజు పెట్టి మరమ్మతులు నిర్వహించాలని పేర్కొన్నారు. రథోత్సవంలో భాగంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి తిరునాళ్లను జయప్రదం చేయాలని కోరారు. ఆయన వెంట ఆర్ అండ్ బీ ఏఈ మైనేని కృష్ణారావు, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, దేవాలయ సిబ్బంది తోటకూర శంకరరావు తదితరులు ఉన్నారు.

పరీక్ష మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోండి

నిజాంపట్నం: విద్యార్థులు పరీక్ష మెటీరియల్‌ను సద్వినియోగ పరుచుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు గీతావాణి తెలిపారు. మండలంలోని చింకపాలెం జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు స్థానిక వ్యాపారవేత్తలు నాళం రంజిత్ కుమార్, నాళం పవన్‌కుమార్‌లు పరీక్షలకు అవసరమైన మెటీరియల్‌ను అందించారు.గత ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమస్థానం సాధించిన విద్యార్థికి రూ.1,116 నగదు పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు యాఖూబ్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపట్నం జెడ్పీ హైస్కూల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీమన్నారాయణ అధ్యక్షతన ఏపీటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో 94 మంది పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్ళు తదితర సామాగ్రిని అందించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు ఆలపాటి శ్రావణ్‌కుమార్, విజయగోపాల్, జంపాని శ్రీనివాసరావు, లింగినేని శ్రీనివాసరావు, షేక్ కరిముల్లా బేగ్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండగ

పెదకాకాని: ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. పెదకాకాని పాతూరు ముస్లింపాలెంలో ఎంపీటీసీ సభ్యురాలు షేక్ గుల్జార్ షరీఫ్ నివాసంలో శుక్రవారం ఉపవాస దీక్ష చేస్తున్న వారికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పాల్గొన్నారు. ముందుగా పవిత్ర రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఉపవాస ప్రార్థనల అనంతరం వారికి స్వయంగా భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం మత పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రంజాన్ ప్రార్థనలో పాల్గొన్న మురళీ కృష్ణ, ముస్లిం మత పెద్దలు

నేడు వలంటీర్ల ఆత్మీయ సమావేశం

పెదకాకాని: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేయడంలో వారధులుగా పని చేస్తున్న వలంటీర్ల ఆత్మీయ సమావేశం శనివారం జరుగుతుందని పెదకాకాని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు తెలిపారు. ముఖ్య అతిథిగా నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. పొన్నూరు నియోజకవర్గ వ్యాప్తంగా జరిగే ఈ ఆత్మీయ సమావేశం ఉదయం 9 గంటలకు పొన్నూరు మున్సిపాలిటీకి సంబంధించిన వారికి పొన్నూరు ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరుగుతుందన్నారు. 11:30 గంటలకు అదే కార్యాలయంలో పొన్నూరు రూరల్ మండలం వలంటీర్లకు జరుగుతుందన్నారు. చేబ్రోలు పరిమి సత్యన్నారాయణ కల్యాణ మండపంలో సాయంత్రం 3 గంటలకు వెనిగండ్ల మైత్రి కల్యాణ మండపంలో పెదకాకాని మండల వలంటీర్లకు ఆత్మీయ సమావేశం జరుగుతుందని ఎంపీపీ తెలిపారు. ఈ ఆత్మీయ సమావేశానికి వలంటీర్లు హాజరు కావాలని కోరారు.